స్కైవాక్‌ల నిర్మాణానికి మెట్రో గ్రీన్ సిగ్నల్

మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి

సిటీబ్యూరో, మార్చి 4 (నమస్తే తెలంగాణ) నగరంలో మెట్రో మార్గాల వెంబడి ఉన్న మాల్స్, మల్టీప్లెక్సులు, కార్యాలయాలతో అనుసంధానం చేసేలా మెట్రో స్టేషన్ల నుంచి నేరుగా కార్యాలయాలకు చేరుకునేందుకు స్కైవాక్‌ల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తామని మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి అన్నారు. దీనికి సంబంధించి రియల్ ఎస్టేట్ కంపెనీలు, ఐటీ కంపెనీలు, ఇతర నివాస భవనాలు, వాణిజ్య సముదాయాల వారి నుంచి అనూహ్య స్పందన వస్తుందని ఆశిస్తున్నారు. ప్రస్తుతం అంబేద్కర్ బాలానగర్ మెట్రో స్టేషన్ నుంచి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఫీనిక్స్, ల్యాండ్ మార్క్ మాల్ కు ఆ సంస్థ వారే స్కైవాక్ నిర్మించుకోగా... అదే తరహాలో ఎల్బీ నగర్ స్టేషన్ నుంచి దాని సమీపంలో నిర్మాణంలోని వాసవీ ఆనందనిలయం నివాస భవనాల సముదాయానికి వాసవీ గ్రూప్ వారు స్కైవాక్ నిర్మిస్తున్నారు. ఇదేతరహాలో నాగోల్, స్టేడియం, దుర్గం చెరువు, కూకట్‌పల్లి వంటి అనేక మెట్రో స్టేషన్ల వద్ద ఉండే కంపెనీలు, భవన నిర్వాహకులు కూడా ముందుకు రావాలని ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ కేవీబీ రెడ్డి అన్నారు. ప్రైవేట్ సంస్థలు మెట్రో స్టేషన్లను అనుసంధానం చేసేలా స్కైవాక్ లు నిర్మించుకోవాలనుకుంటే ఎల్ అండ్ టీ మెట్రో రైల్ స్టేషన్ రిటైల్ అధికారి కె.వి. నాగేంద్ర ప్రసాద్ ను సంప్రదించాలన్నారు.

మెట్రోపై సర్కార్ హ్యాండ్సప్

డీపీఆర్‌కు ఆమోదం.. కేంద్రం కోర్టులోకి నెట్టిన రాష్ట్ర ప్రభుత్వం

నేటికి డీపీఆర్‌ను ఆమోదించని కేంద్రం

రేవంత్-కిషన్ రెడ్డి పరస్పర ఆరోపణలతో కాలయాపన

సిటీబ్యూరో, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : నగరంలో కాంగ్రెస్ హయాంలోనే మెట్రోకు శంకుస్థాపన పడిందని, నగరంలో మెట్రో పరుగులకు కారణం అప్పటి కాంగ్రెస్ నేతలేనని చెప్పుకునే రేవంత్ రెడ్డి... అధికారంలోకి వచ్చిన తర్వాత అట్టహాసంగా చేపట్టిన మెట్రో ఫేజ్ – 2 విస్తరణ పనులకు కేంద్ర అనుమతులు తీసుకురాలేకపోతున్నారు. నగరంలో వందల కిలోమీటర్ల మెట్రో లైన్లు నిర్మిస్తున్నామని చెప్పుకుంటూ... అందుకు అవసరమైన డీపీఆర్‌లకు హడావుడిగా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి, బంతిని కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి పంపి చోద్యం చూస్తోంది. డీపీఆర్‌తో కేంద్రానికి చేరి నెలలు గడిచిపోయినా.. ఇప్పటికీ ఉలుకుపలుకు లేదు. డీపీఆర్‌కు కేంద్రం ఆమోదం తెలిపితేగానీ, హైదరాబాద్ కేంద్రంగా మెట్రో విస్తరణకు తావు లేదు. నిజానికి ఈ ప్రక్రియ ఎప్పుడో పూర్తి కావాల్సి ఉన్నా.. విస్తరణ ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతోనే... డీపీఆర్ తయారీ నుంచి ఆమోదం వరకు ఆలస్యం అవుతుండగా.. అసలు విషయాన్ని మరిచిన కాంగ్రెస్, బీజేపీలు పరస్పర ఆరోపణలతో ప్రాజెక్టును నీరుగారుస్తున్నారు. మెట్రో ఫేజ్–2 విస్తరణకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపిస్తుంటే... కాంగ్రెస్ నిర్లక్ష్యమే మెట్రో విస్తరణకు పెద్ద ఆటంకంగా మారిందని మాటలతో పూట గడిపేస్తున్నారు.

విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువాలి

విద్యార్థినికి షీల్డ్ అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం

ఆలేరు టౌన్, మార్చి 4 : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువాలని మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాస్, శర్భనాపురం శివాలయం ఫౌండర్ సి.రవీందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన ఎవరెస్ట్ హైస్కూల్ వార్షికోత్సవంలో వారు మాట్లాడారు. విద్యతోపాటు శాస్త్ర సాంకేతిక పరమైన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎవరెస్ట్ హైస్కూల్ ప్రిన్సిపాల్ అనితాబాయి, కరస్పాండెంట్ విజయ్‌కుమార్, ఎస్‌టీఓ శ్రీనివాస్, ప్రముఖ కవి తిరునగరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మోహన్‌రావు, గాదె సోమిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల విషయంలో ఆందోళన వద్దు

డీఎఫ్‌వో సుధాకర్‌రెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, మార్చి 4: సాహెబ్ నగర్ కలాం సర్వే నంబర్ 201/1 రిజిస్ట్రేషన్ల విషయంలో ఆందోళన వద్దని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. మంగళవారం కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి సైఫాబాద్ లోని అరణ్యభవన్‌లో డీఎఫ్‌వో సుధాకర్ రెడ్డి ని కలిశారు. డీఎఫ్ఓ సానుకూలంగా స్పందించి రిజిస్ట్రేషన్ల పునరుద్ధరణకు అటవీ శ్రేణి అధికారి , వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్‌తో చర్చిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీవాసులు ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని 201/1 సర్వే నంబర్ల లోని బీఎన్‌రెడ్డి నగర్, ఎస్‌కేడీ నగర్, శ్రీరామనగర్ , బీఎన్‌రెడ్డి నగర్ ఫేస్ 3 కాలనీలకు కోర్టు కేసు వర్తించదన్నారు. 102 ఎకరాల ఫారెస్ట్ ల్యాండ్ పైనే పైవేట్ వ్యక్తులు కోర్టులో కేసు వేశారన్నారు. డీఎఫ్ఓతో మాట్లాడి ఫారెస్ట్ ల్యాండ్ వరకు మా త్రమే రిజిస్ట్రేషన్ల ఆపి మిగతా కాలనీల్లో రిజిస్ట్రేషన్ల పునరుద్ధరించడం కోరినట్లు తెలిపారు, 118 జీవోకు సంబంధించిన కాలనీవాసులు భయాందోళనకు గురికావొద్దని అ న్నారు. బీఎన్‌రెడ్డి నగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, సెక్రటరీ ధనరాజ్, ఎస్.కె.డీ.నగర్ కాలనీ గౌరవ అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి, సెక్రటరీ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

అంబేద్కర్ వర్సిటీలో ఫిట్ ఇండియా కార్యక్రమం

మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్,మార్చి 4: మానసికంగా, శారీరకంగా మహిళలు ఫిట్‌గా ఉంటే ఆ కుటుంబంలోని వారంతా ఫిట్‌గా ఉన్నట్లే అని డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ. ఘంటా చక్రపాణి అన్నారు. మహిళా దినోత్సవంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని మంగళవారం జూబ్లీహిల్స్‌లోని అంబేద్కర్ వర్సిటీలో వైస్ చాన్స్‌లర్ ప్రొ. ఘంటా చక్రపాణి ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఫిట్ ఇం డియా కార్యక్రమంలో భాగంగా దేశంలోని 69 యూనివర్సిటీలు ఎంపిక కాగా వాటిలో తెలంగాణ నుంచి అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ మాత్రమే ఉండటం గర్వ కారణమన్నారు. ఈ సందర్భంగా మహిళా క్రీడా వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. దీనిలో భాగంగా భారీ మారథాన్‌తో పాటు బ్యాడ్మింటన్, క్యారమ్స్ తదితర క్రీడల్లో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. అకడమిక్ డైరెక్టర్ ప్రొ. పుష్పా చక్రపాణి, ప్రొ.పల్లవి కాట్రే, ప్రొ. మేరీ సునంద పాల్గొన్నారు.

ఖనిజ వనరుల అన్వేషణలో జీఎస్ఐ కీలకపాత్ర

వేడుకలను ప్రారంభిస్తున్న జీఎస్ఐ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఎస్‌డీ పట్నాజే

మన్సురాబాద్, మార్చి 4: ఖనిజ వనరుల అన్వేషణలో జీఎస్ఐ ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని జీఎస్ఐ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఎస్‌డీ పట్నాజే తెలిపారు. భారతీయ భూ వైజ్ఞానిక సర్వే సంస్థ(జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) 175వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం బండ్లగూడ జీఎస్ఐ టీఐ ప్రాంగణంలోని ఎంఎస్ కృష్ణన్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్నాజే మాట్లాడుతూ 1851 లో రైల్వేల కోసం బొగ్గును గుర్తించేందుకు ప్రారంభమైన జీఎస్ఐ పయనం నేడు దేశ పురోగతిలో ఎంతో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. జాతీయ భౌగోళిక శాస్త్ర సమాచారాన్ని అందించడంతో పాటు ఖనిజ సంపదను గుర్తించి దేశాభివృద్ధికి జీఎస్ఐ పాటుపడుతుందన్నారు. జీఎస్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్టాళ్లను ఏర్పాటు చేసి వివిధ ఖనిజాలు, రాతి, శిలాజ నమూనాలను ప్రదర్శించారు. అంతకుముందు అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఎస్‌డీ పట్నాజే పలువురు అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జీఎస్ఐటీఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్ రవి, రిటైర్డ్ డీడీజీ డాక్టర్ ఎం రామకృష్ణన్, రిటైర్డ్ డీజీ డాక్టర్ ఎన్ కుటుంబరావు, రిటైర్డ్ డీజీ ఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు విజిటర్స్ అవార్డు

అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ నంగియా

కొండాపూర్, మార్చి 4 : అధిక జీవ లభ్యత కలిగిన మందులు, ఔషధాల ఆవిష్కరణ, అభివృద్ధిలో అందించిన సేవలకు గాను హెచ్‌సీయూ ప్రొఫెసర్ అశ్విని కుమార్ నంగియా ప్రతిష్టాత్మక విజిటర్స్ అవార్డుకు ఎంపికయ్యారు. మంగళవారం కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమక్షంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ప్రొఫెసర్ నంగియా వర్సిటీలో స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ డీన్ గా వ్యవహరించారు. ఫిజికల్ సైన్స్ లో ఆయన అందించిన సేవలకు గాను ఈ అవార్డు అందుకున్నారు. వర్సిటీ అధ్యాపక బృందం ఆయనను అభినందించారు.

బొటానికల్ గార్డెన్‌లో వన్యప్రాణి దినోత్సవం

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

శేరిలింగంపల్లి, మార్చి 4: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొండాపూర్ లోని బొటానికల్ గార్డెన్ లో ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన ప్రపంచ వన్యప్రాణి దినోత్సవంలో కామరెడ్డి జిల్లా పరిషత్ పాఠశాల నుంచి 165 మంది, నాగర్ కర్నూల్ పాఠశాల నుంచి 187 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. బొటానికల్ గార్డెన్ లో ఉన్న కాక్టస్ గార్డెన్, మూలికా ఔషధ వనం, ఆర్చిడేరియమ్, ఫెర్నేరియం, నెపంథిస్ మొక్కల గురించి వివరించి, సీతాకొక చిలుక వనం, సంగీత వనం, పెన్సిల్, రబ్బర్ వనం, ఇంద్రధనస్సు వనం, పేపర్ గార్డెన్ వంటి థీమ్ పార్క్ లకు పై అవగాహన కల్పించారు. ఎకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ తనూజ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎకో టూరిజం రంజిత్ నాయక్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మా రెడ్డి, ఎఫ్ఆర్వో శ్రీనివాస్, డిప్యూ టీ ఎఫ్ఆర్వో శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

30శాతం మందికి ఊబకాయ సమస్య

సిటీ బ్యూరో, మార్చి 4, (నమస్తే తెలంగాణ): దేశంలో 60 శాతం మంది లావుగా ఉండగా, 30 శాతం మంది ఊబకాయ సమస్యతో బాధపడుతున్నారని ఏఐజీ దవాఖాన చైర్మన్ డా. నాగేశ్వర రెడ్డి తెలిపారు. హైదరాబాద్ హైటెక్ సిటీలోని ఐటీ ఉద్యోగులపై చేసిన అధ్యయనంలో 80 శాతం మంది అదనపు బరువుతో ఉన్నారని తేలినట్లు వివరించారు. ప్రపంచ ఊబకాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఏఐజీ దవాఖాన 'బ్రేక్ ది వెయిట్' అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై, ఊబకాయ సమస్య కేవలం ఆహారంతోనే సంబంధం కలిగినది కాదని, ఇది జీవన శైలి, సామాజిక ప్రభావాలు, మానసిక ఒత్తిడి వల్ల కూడా వస్తుందని తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

సిటీబ్యూరో, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : నేటి నుంచి ఈనెల 25 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. హైదరాబాద్ జిల్లాలో 244 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి ఒడ్డెన్న తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 401 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, ఇతర కాలేజీల్లో మొత్తం 1,59,180 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో మొదటి సంవత్సరం 78,100, సెకండ్ ఇయర్ 81,080 మంది విద్యార్థులు ఉన్నారు. కాగా, జిల్లా వ్యాప్తంగా 6,367 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించనున్నారు. ప్రతి సెంటర్‌లో ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారి డ్యూటీలో ఉంటారు. 244 చీఫ్ సూపరింటెండెంట్లు, 244 డిపార్టుమెంట్ ఆఫీసర్లు, 10 సిట్టింగ్ స్క్వాడ్స్, 5 ఫ్లైయింగ్ స్క్వాడ్స్, హై పవర్ కమిటీలు, జిల్లా పరీక్షల విభాగం కమిటీలు పరీక్షల నిర్వహణను పరీక్షిస్తారు. పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుంది. గంట ముందు నుంచే విద్యార్థులను పరీక్ష హాల్‌ల్లోకి అనుమతిస్తారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఉంటుంది. పరీక్ష జరిగే సమయాల్లో స్థానికంగా 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్ష కేంద్రంలో తాగునీరు, ఏఎన్ఎం, ఆశ వర్కర్ అందుబాటులో ఉంటారు. ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచనున్నారు.

జిల్లా	కేంద్రాలు	విద్యార్థులు
హైదరాబాద్	244	1,59,180
మేడ్చల్	150	1,26,423
రంగారెడ్డి	185	1,47,211

పరీక్ష కేంద్రం లొకేషన్ తెలుసుకునేందుకు ప్లేస్టోర్‌లో లొకేషన్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకుంటే అందులో హాల్ టికెట్ నెంబర్ ఎంటర్ చేస్తే పరీక్ష కేంద్రం ఎంత దూరంలో ఉంది అనే వివరాలు తెలుసుకోవచ్చని ఒడ్డన్న తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఆందోళనకు ఒత్తిడికి గురైతే పరిష్కారం కోసం టెలీమానస్ టోల్ ఫ్రీ నెంబర్ 14418 లేదా 1800914416ను సంప్రదించి కౌన్సెలింగ్ సేవలను పొందొచ్చని ఆయన పేర్కొన్నారు.

7గంటల నుంచి బస్సు సేవలు

సిటీబ్యూరో, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : ఇంటర్మీడియట్ పరీక్షల దృష్ట్యా విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా బస్సు సేవలను పెంచినట్టు అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత మార్గాల్లో బస్సులు ఆలస్యంగా ఉంటే తక్షణమే 9959226161, 9959226154 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు ఇవ్వాలని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 4 గంటల వరకు ప్రత్యేక సిబ్బంది బస్సు సేవలపై పర్యవేక్షిస్తారని వివరించారు.

వైద్యసేవల్లో నిమ్స్ ముందడుగు

మాట్లాడుతున్న ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీ భూషణ్ రాజు

ఖైరతాబాద్, మార్చి 4: నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) వైద్య సేవలు, మెడికల్ టీచింగ్, పరిశోధన రంగంలో కీలక ముందడుగులు వేస్తోందని నిమ్స్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు, నెఫ్రాలజీ విభాగం సీనియర్ వైద్యుడు డాక్టర్ శ్రీభూషణ్ రాజు అన్నారు. మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022తో పోల్చుకుంటే 6. 6లక్షల రోగులు చికిత్స కోసం వస్తే 2024లో 9.2 లక్షల మంది చికిత్స తీసుకున్నారన్నారు. టీఎంవీఆర్, వెన్నుపాము ఉద్దీపన లాంటి అనేక క్లిష్టమైన శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామని, డయాలసిస్ విభాగం తెలుగు రాష్ట్రాల్లోనే అతి పెద్దదిగా కొనసాగుతోందన్నారు. రోగనిర్ధారణ పరీక్షల సంఖ్య ఏటా 34.6 లక్షలకు చేరిందన్నారు. బెయిన్ ల్యాబ్, డావిన్సీ రోబోటిక్ సర్జరీ లాంటి అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని, ఏయిమ్స్ లాంటి వైద్యశాలతో సమానంగా పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. నిమ్స్ చరిత్రలోనే తొలిసారిగా 43 మంది అధ్యాపకులకు పదోన్నతులు లభించాయన్నారు. నిమ్స్ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు అహర్నిశలు శ్రమించాలన్నారు.

ఏవీ కళాశాలలో సందడిగా ఆవిష్కార్

సిటీబ్యూరో, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : దోమలగూడలోని ఏవీ కళాశాలలో మంగళవారం ఆవిష్కార్, అంగడి కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహించారు. అంగడి కార్యక్రమంలో 55 వరకు స్టాల్స్ వెలిశాయి. ఏవీ కళాశాల విద్యార్థిని, విద్యార్థులతో పాటు 119 మంది విద్యార్థులు నగరంలోని వివిధ కళాశాలకు చెందినవారు హాజరై తమ నైపుణ్యాలను , ప్రదర్శిస్తూ తాము రూపొందించిన వంటకాలను ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సీహెచ్ రాజలింగం ఆధ్వర్యంలో ఇక్కడి అధ్యాపకులు మొదటగా ఆవిష్కార్ కార్యక్రమాలను ప్రారంభించారు. ముందే నిర్దేశించిన పది అంశాలలో కళాశాల విద్యార్థులతో పాటు నగరంలోని అనేక కళాశాల నుంచి విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు. దీని నిర్వహణ ముఖ్య ఉద్దేశం విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక నైపుణ్యాలను, వెలికి తీయడం, వారిలో ఆత్మ న్యూనత భావాన్ని పారదోలడం, వైజ్ఞానిక అంశాలు, సాంస్కృతిక అంశాలు, కళలపై తగిన వైఖరిని ప్రదర్శించడమే అని ఆవిష్కార్ కో- కన్వీనర్ డా. రిషిత రెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అంగడి కో- కన్వీనర్ మజ్జిగ రమేశ్ యాదశ్ ప్రొఫెసర్ రేణు మాథూర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ .డా. పున్నేమి పద్మ తదితరులు పాల్గొన్నారు.

వంశీ గొప్ప హాస్య దర్శకుడు

దర్శకుడు వంశీని జ్ఞాపికతో సత్కరిస్తున్న సినీనటుడు రాజేంద్రప్రసాద్, వంశీరామరాజు

రవీంద్రభారతి,మార్చి4: సితార, అన్వేషణ, లేడీస్ టైలర్, ఆలాపన వంటి అనేకమైన అద్భుతమైన హాస్యభరితమైన చిత్రాల దర్శకుడు,రచయిత వంశీ దర్శకత్వం వహించిన సినిమాల్లో తాను నటించడం అదృష్టంగా భావిస్తున్నానని ప్రముఖ సినీనటుడు డా.రాజేంద్రప్రసాద్ అన్నారు. వంశీ ఇంటర్నేషనల్ (ఇండియా) గాయని శారద(అమెరికా) సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో వంశీ సినీ జీవిత స్వర్ణోత్సవ వేడుక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీనటుడు రాజేంద్రప్రసాద్, రచయిత వేమూరి సత్యనారాయణ, సినీ ఆటోగ్రాఫర్ ఎం.వి రఘుహరి అనుమోలు, నిర్మాత ఏడిద రాజా , సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి వంశీకి మెమోంటో అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీనటుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ హాస్యదర్శకుడు వంశీ దర్శకత్వ ంవహించిన అనేక సినిమాల్లో తాను నటించడం తన పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నారని పేర్కొన్నారు. అనేక హాస్యభరితమైన,వినూత్నమైన సినిమాలకు దర్శకత్వం వహించిన వంశీ గొప్ప దర్శకుడని రాజేంద్రప్రసాద్ కొనియాడారు. వంశీ వినూత్నమైన హాస్యభరితమైన మంచి సినిమాలకు దర్శకత్వం వహించిన గొప్ప దర్శకుడు అని కొనియాడారు. వంశీ దర్శకత్వం వహించిన సినిమాల్లో తాను నటించానని, ఎన్నో సినిమాలు విజయాలు సాధించిపెట్టాయని కొనియాడారు. రవీంద్రభారతి వేదికపై తనను సత్కరించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. సభకు ముందు గాయని శారద బృందంతో ఆలపించిన సినీగీతాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వంశీ సంస్థల చైర్మన్ డా. వంశీరామరాజు పాల్గొన్నారు.

ఎలివేటెడ్ కారిడార్ భూసేకరణపై విచారణ

మేడ్చల్, మార్చి4(నమస్తే తెలంగాణ): జాతీయ రహదారి జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ రింగ్ రోడ్డు వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ భూసేకరణపై వచ్చిన ఫిర్యాదులపై అధికారులు విచారణ ప్రారంభించారు. మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్ ల జిల్లాల పరిధిలో 18 కిలో మీటర్ల మేర నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో శామీర్‌పేట్ రింగ్‌రోడ్డు నుంచి లోతుకుంట వరకు భూ సేకరణ గుర్తింపు పక్రియను జిల్లా అధికారులు పూర్తి చేసి గత నవంబర్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో భూసేకరణ గుర్తింపు పక్రియపై 226 అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదులు చేశారు. రోడ్డు విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో 341 నిర్మాణాలు, లక్ష 12 వేల చదరపు అడుగుల స్థలం కావాల్సి ఉంది. దీనిపై ఆస్తులు కోల్పోతున్న ఆస్తుల యజమానులు వివిధ అభ్యంతరాలు వ్యక్తం చేస్తు చేసిన ఫిర్యాదులపై మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో భూసేకరణ అధికారి శంకర్ కుమార్ విచారించారు. మంగళవారం ప్రారంభమైన ఫిర్యాదులపై విచారణను ఈ నెల 13 వరకు నిర్వహించనున్నారు.

అభ్యంతరాలను విచారిస్తున్న భూసేకరణ అధికారి శంకర్ కుమార్

వెల్‌నెస్ కేంద్రంలో ఓపీ తగ్గలేదు

సిటీబ్యూరో, మార్చి 4, (నమస్తే తెలంగాణ): ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ వెల్‌నెస్ సెంటర్‌లో ఓపీలు తగ్గలేదని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ సీఈవో ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. నమస్తే తెలంగాణలో సోమవారం ప్రచురితమైన 'వెల్‌నెస్ సెంటర్లకు సుస్తీ చేసింది' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందిస్తూ గతేడాది సెప్టెంబర్ నుంచి నేటి వరకు 79,550 మంది ఔట్ పేషెంట్లు వచ్చారని తెలిపారు. ఈ మధ్య కాలంలో ఒక మెడికల్ అధికారి రిలీవ్ కాగా, ప్రస్తుతం ఇద్దరు మెడికల్ అధికారులు ఉన్నట్లు పేర్కొన్నారు.

వంతారా ప్రారంభం

సిటీబ్యూరో, మార్చి4,(నమస్తే తెలంగాణ): రిలయన్స్ సంస్థ గుజరాత్‌లో ఏర్పాటు చేసిన వన్యప్రాణుల పునరావాసం, సంరక్షణ కేంద్రమైన వంతారాను పీఎం నరేంద్రమోదీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో పునరావాసం పొందుతున్న వివిధ రకాల జంతువులతో ఆయన సరదాగా గడిపారు. వాటికి ఆహారం అందించారు. జంతువులకోసం ఎమ్మార్ఐ, సిటీ స్కానింగ్, ఐసీయూలు ఏర్పాటు చేసిన వన్యప్రాణుల ఆసుపత్రిని పరిశీలించారు.

యూపీఐ పేమెంట్స్‌ను అనుమతించని కండక్టర్లు

సిటీబ్యూరో, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ బస్సుల్లో ఆన్‌లైన్ చెల్లింపులతో జరుగుతున్న టికెట్ జారీ ప్రక్రియపై కండక్టర్లకు సరైన అవగాహన ఉండటం లేదు. ఇటీవల ఆర్టీసీ అధికారులు గ్రేటర్‌లోని 25 డిపోలకు ఆన్‌లైన్ ప్రక్రియలో భాగంగా 6 వేల టిమ్స్ మిషన్లను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో ప్రయాణికుడు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ప్రయాణం చేయాలో వివరాలు ఎంటర్ చేస్తే నేరుగా చార్జీ చూపిస్తూ క్యూఆర్ కోడ్ వస్తుంది. దానిని స్కాన్ చేసి యూపీఐ చెల్లింపు చేసి టికెట్ పొందొచ్చు. అయితే ఈ ప్రక్రియలో కొంతమంది కండక్టర్లు ఆన్‌లైన్ చెల్లింపులకు నిరాసక్తత చూపిస్తున్నారు. యూపీఐ పేమెంట్ చేసే సమయంలో కొన్ని సార్లు ఆలస్యంగా అవుతుందని కండక్టర్లు చెబుతున్నారు. యూపీఐ చెల్లింపులకు కండక్టర్ అంగీకరించడం లేదని.. చిల్లర లేకుంటే బస్సు దిగిపోవాలని చెబుత